# గుండెలు తీసిన బంటు

ఆంగ్లమాస పత్రికలోని కథ చదువుతూ, తనలో తాను తర్కించుకుంటూ నవ్వుకుంటున్నది జానకి.

'యెలిపోతన్నాను.' వాకిలి నానుకుని నిలబడింది పని మనిషి.

ఆరోజు సాయంత్రం పొద్దు వాటారాక పనిలోకి వచ్చింది యేడు గంటలైంది దీపాలు వెలిగినై. 'అప్పుడే తోమేశావా గిన్నెలూ? తెల్లగా తోమావా' అన్నది జానకి.

'తెచ్చి సూపమన్నారా? మీరే చూసుకుంటారా?' అన్నది యీశ్వరమ్మ.

'చూసుకుంటాలే గానీ, మేడ మీద గుడ్డలారేశాను తెచ్చిపెట్టు.'

'తెచ్చేసినాను. మడతలెట్టి బల్లమీదెట్టినాను.' అన్నది చేతులు చూసుకుంటూ. 'యేటో నవ్వుకుంటున్నారే?' అన్నది చనువుగా.

'కథ బావుంటే నవ్వు వచ్చింది. చదువు నేర్పుతా నేర్చుకోమంటే నేర్చుకోవైపాయె.' పుస్తకం తొలగించి యీశ్వరమ్మ వంక చూసింది జానకి.

"నాకేడ కుదఃరుద్దీ? నాలుగిల్లలో గిన్నెలోమీ, యిల్లు సిమ్మీ, గిన్నెల్నిండ కూడట్టుకు రాకపోతే, మాయమ్మ 'బువ్వంత ఆడే ఒనీసినావా?' అని సీపిరి తిరగేసి యీపు పదును చేస్త ది." మళ్లా చేతులు చూసుకున్నది. వినాలనే కుతూహలంవల్ల అడిగింది.

'పోనీ కత సెప్పరూ యిని పోతా.'

'చేతివాటం యెంత బాగా చేస్తాడో కథ ద్వారా చెప్పాడు. నీకు ఆ వివరమంతా చెపితే నీకూ అలా చేయాలనిపించదూ?' నవ్వింది.

"ఓస్! అందుకా నవ్వుతున్నారూ? నిజంగా మీ గిన్నె కటి పోతే నవ్వ వస్తాదా మీకు. తిట్టుతారు, నిగ్గ దీస్తారు, అదే నగ అయితే పోలీసోణ్ణి తెచ్చి తన్నిచ్చి బెదిరించి లాగుతారు,' తలా కళ్లూ చేతులూ జోరుగా తిప్పుతూ నవ్వులు ఒలక బోసింది యీశ్వరమ్మ, ద్వారానికి అనుకున్నది.

పరికిణీ అంచులు తడిసిపై, మాసిన జుట్టూ, తెలిసిన పాత చీర ముక్కఓణీ, బోసి చేతులూ, ముక్కు పుడకా, పెద్దకళ్ళూ ఆకళ్లు తిప్పుతుంది, ఆకళ్ళలో యేదో కనబడుతుంది. అదేమిటో అర్ధంగాలేదు జానకికి. నాగా పెట్టకుండా వస్తుంది. గాజు గ్లాసులూ, కప్పులు, సాసర్లు పగలకుండా కడుగుతుంది. ఒక్కో రోజు నిదానంగా చాలా పని చేసి పెడుతుంది. మాటలంటే పడదు, యెదురు తిరిగి రెట్టిస్తుంది, పోతపోసిన విగ్రహంలాగా

వుంటుంది, నలుపు, సమానమైన యెత్తు. మరీ పొడగరి కాదు. ప్రపోర్షనేట్ బాడీ, అందాల పోటీ కెళ్తే గెలుస్తుంది. నరాలు కనబడని చేతులు ప్రతీ విషయంలో పట్టూ విడుపూ వుండాలని తెలుసు దానికి. కుడియెడమైతే పరవాలే దంటుంది. యేదిచ్చి నా తీసుకుంటుంది. యేమీ యివ్వకపోయినా అడగదు. ఇచ్చే దానికి యెంతపని చేయాలో అంతే చేస్తుంది. ఒక్క పిసరు యెక్కువ చేయదు. తక్కువా చేయదు, పని మానేయదు. తీసేస్తా అని బెదిరిస్తే యేమి సేయలేదూ? సేస్తా. అంటూ రెట్టింపు పనిచేసి నవ్వుతుంది. పని నిలబెట్టుకుంటుంది, జీవిత మనే గుజ్జుబ్బండిని తోలుకు పోతుంది.

'సెప్తారా, యెలిపోనా?' యీశ్వరమ్మ గుర్తుచేసింది.

జానకికి తాను చదివింది యితరులకు చెప్పి ఆనందించ నిదీ తృప్తి వుండదు. ముఖ్యాంశాలే చెప్పి కథ అయిదు నిమి షాల్లో ముగించింది. అంతా విని ఈశ్వరమ్మ నవ్వింది.

"నువ్వు కూడా చేసేవు, వున్న పేరు కాస్తాపోతుంది."

"నేను సేస్తే మీరు పట్టుకో గలరా?" అర్థవంతంగా చూస్తూ నవ్వింది. చేతివేళ్ళు చూసుకుంటూ తలవంచింది.

"అది వేరే సంగతి. అప్పుడే నీమీద అనుమానం కలిగింది. దొంగ నవ్వు నవ్వుతున్నావు."

"అనుమానిస్తే యేమైనట్టండీ. నాసేతులో మీ వస్తువుండగా పట్టియాల. పుట్టినే అనుమానిస్తే వస్తువూడి పడుద్దా? రేపు మిరపకాయలు బేగి యెండలో పెట్టండి. యెండుండగానే వచ్చేసి దంచి పెడతా, మెత్తబడితే మెదగవు."

"మిల్లు పట్టించి తెచ్చేస్తానంటివే ప్లేటు ఫిరాయించావేం? యేమిటి విశేషం?"

"నా బస్సెల్లిపోతాది, పోవాల" రివ్వున వెళ్ళిపోయింది యీశ్వరమ్మ.

## 2

'జానీ! నా కొత్త పెన్నేదీ, కనబడటం లేదు, ఆఫీసు కెళ్ళాలి, టైమైంది." జానకి భర్త కేకవేశాడు. జానకి యిస్త్రీ గుడ్డలు బీరువాలో సద్దుతున్నది. హేంగర్స్‌కి బుష్‌కోట్లు యెక్కిస్తున్నది. చేతులో పనివదిలేసి వచ్చి వెతికింది, గాలించింది. కంటబడలేదు పెన్ను. "యిల్లు చిమ్మేటప్పుడు సుభద్ర యిక్కడే నిలబడివున్నాదండీ. యేచొక్కా జేబులోనో వుంటుంది. కనబడుతుంది. ఇవ్వాళ్టికి మరొకటి తీసికెళ్ళండి" చెదిరి మొహానపడుతున్న జుట్టును పైకి నెట్టుకుంటూ మరో పెన్ను అందించింది భర్తకి.

జానకిపెట్టిన పోజు భర్తకిష్టం, అప్పటికి క్షమించి పెన్నందుకు వెళ్ళిపోయాడుగానీ మనసులో వ్యధ కలిగింది.

అది వెండి పెన్ను, బాల్ పాయింటు, పైగా అది తన బాస్‌చే ప్రెజెంట్ చేయబడింది. ఆ పనిమనిషి పనే యిది అని అనుమానం కలిగింది. దాని చూపే యెలుకు చూపులాగా వుంటుంది. ఇంటికి వస్తూనే చిరాకు పడ్డాడు.

"దాన్ని మరీ నెత్తినెక్కించు కుంటున్నావు, పెన్ను కనబడిందా?" అన్నాడు బూట్లు విప్పుతూ.

"ఇంత మటుకేదీ పోలేదుగదండీ, చెప్పించు కోకండానే పని అందుకుంటుంది, చుట్టాలొస్తే", బూట్లూ సాక్సూ అవతలుంచి లుంగీ అందించింది.

'చాల్లే పొగడ్త. వుయ్యాల్లో నీ కొడుకు గొంతు చించుకుంటున్నాడు. వాడి సంగతి చూడు' భర్త బాత్‌రూమ్‌లో దూరాడు.

వారం తిరగలేదు, షర్టు గుండీలు, కప్సు, కనబడలేదని అరిచాడు. అవి వెలగలవి.

పిల్లలు సాయంచేస్తూ, మొగుడు ప్రేమగా చూస్తుంటే రోజులు నిమిషాలుగా దొర్లి పోతాయి జానకికి, పిల్లలు కూడా పెన్సిళ్లూ రబ్బర్లూ, కనబడటం లేదని గొడవ చేశారు. తినీతినకా బడికి పరుగెత్తుతున్నారు, జానకికి ఆ కలి మందగించింది. మిగినవన్నీ పనిమనిషికి వేసేస్తున్నది. ఓక్కోరోజు పడలేక

వెతికివ్వమంటుంది. ఈశ్వరమ్మ వెతికి తెచ్చి యెదుట వుంచుతుంది. జానకి మరీ నీరసించి పడక వేసింది. భర్త భాస్కర్ డాక్టర్ని తెచ్చాడు.

'జాండిస్ వచ్చిందండీ. చాలా జాగర్తగా వుండి కఠిన పథ్యం చేయాలి, మూడు నెలలు పీడుస్తుంది కామెర్ల, పెద్ద వాళ్ళను కనిబెట్టి చూచే వారినీ పిలిపించండి.' అని ఫీజు పుచ్చుకువెళ్లాడు.

భాస్కర్ యింవా పంపి వుత్తరం వ్రాసి అత్తగార్ని పిలిపించాడు. మంగమ్మగారు ఆదుర్దాతో బాటు ఆచారాన్నీ వెంట బెట్టుకొచ్చింద. వంటా పెట్టూ చేస్తున్నంతసేపూ అరుస్తూనే వుంటుంది.

'అమ్మాయ్! జానీ! ఇదేమిటి యీ పని పిల్ల అంట్లు తోమి తెచ్చి యింట్లో పెట్టేస్తున్నది. దొడ్లోనే బోర్లించమను. నేను రెండోసారి కడుక్కోవాలి' అని వురిమింది.

ఈశ్వరమ్మ నిలబడి, కన్నార్పకుండా ఆవిడనే చూస్తుంది ఆవిడా చూస్తుంది.

ఈశ్వరమ్మ బట్టలు పిండి ఆరేస్తున్నది.

"మరో పెట్టు వేశాలే పిల్లా! యేదీ నాకు విడబడలేదే. అప్పుడే, పిల్లలవీ నావీ అన్నీ వుతకటమై పోయిందీ? తాడు మీద కెక్కించేశావే. నాథోవతీ మరో పెట్టు వేయకపోయినా? అన్నీ తడీపొడిగా వుండగా ఆరేశావు? అని నసబెట్టింది.

'నాసెన్నడు పన్జేసి యెరగనండీ, ఇదే మొదలు. అమ్మ గారు పన్జేసికోలేక పోతన్నారని మా యమ్మ నన్నెట్టింది. మేము గుడ్డలు తుక్కోమసలు. చాకలికి వేస్తాము. నేనింటి కాడ పన్జేయననసలు.'

ఇద్దరూ వాదులాడు కునేవారు.

మంగమ్మగారు ఓడిపోయినారు. ఆ వి ద కి తలపట్టి పోయింది. అవిడ మధ్యాన్నం భోజనం కానిస్తుండగానే యీశ్వరమ్మ వచ్చేస్తుంది.

'గిన్నె లేయండి. పోవాల, ఆపక్కింటోరు తిడతారు రెం డింటికల్లా ఆరిపని అందుకోవాల.' అంటూనే యిల్లు చిమ్మేసింది గుడ్డలు తెచ్చి నేలమీద పడేసింది.

మధ్యాన్నం చిన్న కునుకు తీయనిదీ సాయంకాలం వంట చేయలేదు మంగమ్మగారు. ఈశ్వరమ్మ తనిష్ట మొచ్చిన వేళకి వచ్చి గడబిడ చేస్తుంది. మంగమ్మగారికి నిద్రలేదు.

మరీ నాలుగున్నరకే వచ్చి తలుపు బాదుతుంది. అయి దింటికి పాలు పితికేవాడు. ఆవిడ పని పురమాయిస్తుంది. తర్జ నితో చూపుతూ యేదో చెపుతుంది.

'ఒల్లు బాగులేదు నే సేయలేను. రేపొచ్చిసేస్తా.' అని వెళ్ళిపోయింది యీశ్వరమ్మ.

చివరకు మంగమ్మగారి పట్టు ధోవతీ కొంగున కట్టుకున్న నోటు పోయింది. ఆమె దానిని రైలు ఛార్జీల కనిదాచు కున్నాది.

"అమ్మాయ్! జానకీ! యిందే పనిమనిషే? మరొక తెను చూడ లేడూ అల్లుడూ? పట్టు ధోవతీ సబ్బురాచి వుతకమన్నారా అంటే, వుతుకూ" అన్నా. ధోవతీ కొంగున ముడేసుకున్న డబ్బు కాస్తా కాజేసింది. కాస్తా కూస్తాకాదు నూరునోటు యేవనీ చెయ్యేడు. నేపోతానికూ, ఇంటిదగ్గర వదినకు యిబ్బంది. నెలలు నిండినయ్యా అన్నీ చేసుకోలేదు. నయంగాదు, మూడు నెలలూ వుండ వీలౌతుందా?

సాయంకాలం జానకి యీశ్వరమ్మను పిలిచింది. నిలేసి అడిగింది. నోటు తెచ్చి తల్లికివ్వమన్నది.

ఈశ్వరమ్మ షోగ్గా సినిమా నటిలాగా యేడుస్తూ జలజలా చాలా కన్నీళ్ళు రాల్చింది.

"పెద్దమ్మగారి ధోతీ కొంగున డబ్బు లేదమ్మగారూ! నన్ను తీసేయించాలని అంటన్నారు. నేనెరగను. ఇన్నాల నించీ సేస్తన్నాను. ఒక్క పైసా పోయినాదా? డబ్బు తీసి పెట్టెలో యెట్టుకునే బట్టేసివారు. పెట్టెలోనే వుంటది. సూసోకండి." అనేసి చర చరా వెళ్ళిపోయింది.

"కూతురు తల్లి వంక చూసింది.

'అసలు పట్టు బట్ట వుతకమని దానికెందుకే శావమ్మా?' అన్నది.

'నే వెయ్య లేదే జానూ, ఒట్టు, బట్ట విప్పి తులసి కోట దగ్గర పడేసి, ఆరేసిన మడిబట్ట కట్టుకుంటున్నాను. బట్టబాగా మాసింది. ఉతికిస్తానంటూ అదే పట్టుకెళ్ళింది. రైలు ఛార్జీ లడిగితే బాగుండదని అన్నయ్యనడిగి ఆ డబ్బు తెచ్చుకున్నా మతిమరుపు యేర్పడింది. పారేసు కుంటానని కొంగునే కట్టు కున్నా.' బేలలాగా చూస్తూ అన్నది తల్లి.

మొగుడికి తెలిస్తే, లేదా అతనితో చెప్పుకుంటే, అతనింకా రాద్ధాంతం చేస్తాడు. జానకి వస్తాయించింది. దానికి తగ్గట్టు ఆ మరునాడు యీశ్వరమ్మ రాలేదు. వరుసగా నాలుగురోజులు నాగా పెట్టింది. అనుమానం కలిగింది జానకికి.

తల్లి పోగొట్టుకున్న డబ్బుగాక, రైలుఛార్జీలు గూడా ఇచ్చుకున్నది జానకి.

## 3

ఆ రోజున యీశ్వరమ్మ యికిలిస్తూ వచ్చింది.

'మా మామ సచ్చిపోయినాడమ్మ గారూ, వూర్లోనే నైపాయె. దినాల కెల్లినాము.' పని అందుకని నిదానంగా చేసింది. వెళ్ళమనేదాకా నిలబడింది.

జానకి, విసుగూ కోపము మింగి,

"వెళ్ళొచ్చు, ఇంకేంపని లేదు." అన్నది.

స్టోర్సు, పనీ, బజారు పనీ అన్నీ అడిగి రేషన్ కార్డు తీసి కెళ్ళి రేషన్ తెచ్చి, లెక్క చూసింది. వంట చేస్తునంత సేపూ అక్కడే వుండి సాయంచేసింది, అమ్మగారి మంచం పక్కన కూచుని కాళ్ళు పట్టింది. అయినా జానకి బాగా నీరసించింది. వాంతులైనై. మొగుడు హాస్పిటల్లో చేర్పించాలని చూశాడు. ఒప్పుకోలేదు జానకి.

"పోనీ నర్సింగ్ హోమ్‌లో పెడతా జానీ!" ఈశ్వరమ్మ "కారియర్ తెప్పించండి బాబూ. మంచి హోటల్ నాకుతెలుసు కారియర్ నే తెచ్చి పెడతా. అమ్మగారు లెగలేరు" అన్నది.

'ఆ డబ్బుకి నువే దొడ్లో వండచ్చుగా' అన్నాడు.

"పోనీ అట్లనే చేస్తా బాబూ"

జానకి మరిది అన్నా, వదిన, పిల్లల్నీ చూసిపోవాలని ఆ రాత్రికి వచ్చాడు. భార్య శాంత, వారికో పదిసెలలు అబ్బాయి, మరిదికి మందుల కంపెనీలో పని, తోటి కోడలు యెమ్మే. బ్యాంక్‌లో వుద్యోగం_ బాగా మేకప్ చేసుకుంటుంది. అబ్బాయి బొద్దు, పసిమి, చేతికి వత్తులూ, మెళ్ళో పులిగోరు పతకం సన్నని గొలుసు, వేలికి యెర్రరాతి వుంగరం, కొత్తలేదు, యీడవడు.

ఈశ్వరమ్మ, శాంత యెటు పోతే అటు చూసింది. శాంత బాగా తయారవుతుంది. బాబ్డ్ జుట్టూ, పెదిమలకూ, గోళ్ళకూ రంగూ, బావగారి స్కూటరెక్కి అలాగ్గా షాపింగ్ చేసివస్తుంది.

చీరకట్టి వంట నేస్తుంది. ఈశ్వరమ్మమీద బాగా దీ ష్టి కం వేసింది. చేతులు తిప్పుతూ మరింత పని చేయించింది. గుడ్డలు మడతలు పెట్టాలి. కొన్ని ఇస్త్రీ చేయించింది.

ఈశ్వరమ్మకి వినోదం కలుగుతున్నా, శాంత వాడేభాష అర్థంగాక కన్నార్పకుండా చూస్తూ నిలబడింది. శాంత నాలుగైదు భాషలు, కలిపి, యేది గుర్తువస్తే అ పదం వాడుతూ అజ్ఞలు జారీచేస్తూ, హడలుగొడుతున్నా ననుకుంటుంది. ఇంగ్లీషులో తిడుతుంది.

జానకి శాంత కంపెనీ ఎంజాయ్ చేయ గలిగింది. తన సుస్తీ మరవగలిగింది. కాని ఈశ్వరమ్మకి పని యెక్కువై సహనం చచ్చింది. శాంత భోజనం కానిస్తు గూడా అరుస్తూనే వుంటుంది. పనిమనిషీ, అయా హెల్పరూ, అష్టావధానం చేయాల్సి వచ్చింది. కాఫీ, టిపినూ, తిండీ అన్నీ బాగానేవున్నా అమె చూపె అధికారం బాగాలేదు.

"ఈశ్వరీ! బాబు జాగర్త, మేటనీకి టైమైంది. శ్రీధర్రికి పూ ప్పి యివ్వు. నన్సెటు కా - నే, అంధేరా రాకముందే, షైర్ తిప్పి యింటికి తెచ్చేయి. తోపుడు ఛైయిర్ తెచ్చా. దానిలో తీసికెళ్ళాలి. కోల్డ్కాచ్ చేస్తాడు. భద్రం, జూయుల్సున్నాయి. అవి నా మదర్ ప్రెజెంటు చేసింది. ఇంటికి రాగానె డ్రెస్ ఛేంజ్ నేయాల." అరుస్తు బావగారి పిల్లలకి తాను దుస్తులేసి తలలు దువ్వి వెంటబెట్టు కెళ్ళింది.

రాత్రి భోజనాలయేవరకూ వుండి, టేబిల్, కిచన్ క్లీన్ చేయాలి. అన్నింటిని గిన్నెలు తోమి షెల్ఫ్ లో బోర్లించి వెళ్ళాలి.

మరిది నవ్వుతూనే గడబిడ చేస్తాడు. పిల్లవాడిని మట్టి లో దించి ఆడనిచ్చిందిట. నెత్తిన మట్టి పోసుకున్నాడట పిల్లవాడు.

'స్టుపిడ్! బేబీ తలమీద టోపీ పెట్టలేదు, పనిదొంగ, నా రేజర్ సెట్టుయేదీ? షేవింగు క్రీమ్ బ్రిల్ క్రీమ్, బినాకా పేస్టు అన్నీ వాడుతున్నది. హెయిరాయిల్ సీసా యేదీ? నీ లవ్వర్ కిచ్చాడా? వాడెవరో నీకోసం వాకిట్లో తారట్లాడు తున్నాడు. తలనొప్పి, జలుబుకి టాబ్లెట్సు బల్లమీదుంచాను. యేవీ? నేసల్ డ్రాప్స్ బాటిల్ యేదీ? అయొడెక్సేదీ?' అని అరిచాడు.

'పిల్లలు తీసి వుంటారు మరిదీ, వెతికిస్తుంది' అన్నది జానకి,

పదిరోజులు గడిచినై, శాంత సందడి చేసింది.

"సిస్టర్! నా బ్రా కనబడలేదు, అది ఫారిన్ లో కొనుక్కున్నాను, హైహీల్స్ వీ? చప్పల్స్ తో సినిమా కెళ్ళనా?" అన్నది.

ఈశ్వరమ్మ శాంత ధాటికి తట్టుకోలేక, కనబడదు, యెదురుగా రాదు, తనకు తోచిన పని చేసి చెప్పకుండా వెళ్ళిపోతుంది. లేదా చూస్తు నిలబడుతుంది.

"దాన్ని యెందుకు డిస్మిస్ చేయరు దీ దీ? వట్టి బ్రూట్ స్కిల్డ్ మెయిడ్ గాదు ఒబిడియన్సు లేదు. యెదురు తిరిగి ఆన్సర్ చేస్తుంది. కామ్‌నిల్, యెన్నాళ్ళ నుండి యిలా వేగుతున్నావు దీ దీ?"

ఆ మరునాడు పిల్లవాడి గొలుసులేదు, శాంత వాచీ కనబడలేదు, అది విదేశీ వస్తువు, ఎలక్ట్రానిక్ వాచ్. దాంతో అసలే పొడగరి అయిన శాంత, యింట్లో అందర్నీ దులిపేసింది. చేతులు ధాటీగా తిప్పింది.

'నా బ్రదర్ ఇరాక్‌నించి తెచ్చి ప్రెజెంటు చేశాడా వాచీ, ఎలక్ట్రానిక్ వాచీ, మీలో యెవరన్నా అటువంటివి తెచ్చారా' అంటూ లేచింది. చేతులో హాండ్ బాగ్‌తో మొగుడి నెత్తిన కొట్టింది.

'మైం బెర్త్ రిజర్వు చేసుకున్నాను. నువ్వు నీ సిస్టరిన్లా రికవరయాక అనా. నేను జాతీ.'

బావగారి కెదురుగా నిలబడి నిటారుగా.

"మీరు జనరల్ మానేజరేగాని, అప్ కో ఘర్ మానేజ్ చేసుకోటంరాదు. సారీ, మీ ప్రైడ్ హర్టయిందేమో" అన్నది.

వాకిలి నానుకుని నిలబడివున్న యీశ్వరమ్మని యడం చేత తర్జనితో చూపిస్తు,

'అది బీస్ట్, దానికి ఒబడియన్సేదే, నమక్ హరామ్. నేనైతే యేక్‌బార్, పోలీసు కవ గించి, నాలేడ్జ కలిగేట్టు చేస్తా మీ హోమ్‌లో, నాతడాఖా, యెలా దిఖాసక్తా. సో. నన్ను ఎక్స్యూజ్ చేయండి' అంటుండగా లిప్‌స్టిక్ రాచుకున్న పెదిమలు వణికినై, కాటుకతో అందంగా దిద్దిన విశాల నయనాల నించి నీటి ముత్యాలు చేంపలమీదికి జారినై.

బావగారు భాస్కరం నీరైనాడు, అవమానమనిపించింది. మరదల్ని సోఫాలో మృదువుగా కూచోబెట్టాడు. లోనున్న గది లోకి పోయినాడు, ఆదాపులనే పోలీస్ స్టేషనున్నది ఫోన్‌చేసి వచ్చాడు, తలపట్టుకు కూచున్నాడు సోఫాలో.

పొద్దూ కుతున్నది, మసక వెల్తురు, దీపాల్తు రాలేదింకా గడియారంటిక్ టిక్ మంటున్నది.

ఈశ్వరమ్మకేం అర్థంగాలేదు, వెళ్ళిపోదామని జానకి కోసం చూసింది, జానకి తన గదిలో కెళ్ళింది. ఈశ్వరమ్మ బెడ్‌రూమెలోకి వెళ్ళింది, మళ్ళా వచ్చేప్పటికి యెదురుగా వాకిలికడ్డంగా హెడ్‌కానిస్టేబుల్, నిలబడిపోయింది.

భాస్కరం ఇంగ్లీష్‌లోనే చెప్పాడు, హెడ్డు ఈశ్వరమ్మను చూస్తూ అడిగాడు.

'తీసినవన్నీ తెచ్చిస్తావా? స్టేషన్కి వస్తావా?' మంచి లావూ పొడుగూ, తీరైన విగ్రహం యూనిఫామ్.

ఈశ్వరమ్మ, హెడ్డుని యెగా దిగా చూసింది, సన్నగా నవ్వింది, కళ్ళు వాల్చేసింది.

'నాకేం తీయనేదు, యాణ్ణుంచి తేనూ' సాగదీస్తు, నిబ్బరంగా అన్నది.

హెడ్ నవ్వకుండా అన్నాడు.

"వీళ్ళట్లా లొంగి రారుసార్! మా ఆతిధ్యం యిస్తే, మా టెక్నిక్ అప్లయ్ చేయంగానే అన్నీ వూడి పడతై."

'జానకీ!' భాస్కరం పిలిచాడు.

జానకి నీరసంగా వుండి, లేచి వచ్చింది. ఖాళీ సోఫాలో కూచున్నది. యేమిటన్నట్టు చూసింది.

'ఈశ్వరమ్మ స్టేషన్కి తీసికెళ్తాడుట' జానకి అనుమతివ్వ లేదు.

'కొడతారా అక్కడ?' విచారంగా చూస్తుఅడిగింది. 'ఒక సారి వాళ్ళకప్పగిస్తే శాశ్వతంగా ముద్ర పడిపోదూ' అన్నది మొగుడితో తల అడ్డంగా ఒక్కసారే తిప్పింది.

శాంత అన్నది, "స్టేషన్కి పంపటం పసందు లేకపోతే, యిక్కడే ట్రీట్మెంటు యివ్వమనండి దీ దీ, వన్ మినిట్లో అన్నీ డెలివర్ చేస్తున్నది. నా డైమండ్ రింగు, ముత్యాల

యియర్ రింగ్సు, స్టడ్సుషన్నా హెయిర్‌పిన్ అన్నీ చలాగయా తీన్ని నమ్మి బీరువా బీగాలిచ్చి, నా సిల్క్ శారీస్ డ్రైక్లీనింగు కి యిచ్చిరమ్మన్నాను. ఒక్క శారీ ఫైవ్ హండ్రెడ్. మంకీ ట్రిక్సుకర్ సక్తీన." అని యీశ్వరమ్మను చూసింది.

'బాబు చెయిన్ అండ్ లాకెట్ నువ్వే తీశావు, యీశీం టిట్?" అన్నది.

జానకి మౌనం, భాస్కరం తల పూపటం పర్మిషన్‌గా గ్రహించి, హెడ్డు, యీశ్వరమ్మని రెండంటించాడు, దాంతో అది ఘొల్లుమని యేడుస్తూ కన్నీటి కాల్వకట్టించిది నిమిషంలో మరోనాల్గు లాఠీ దెబ్బలు పడినాయి. నాడి కాళ్ళకు చుట్టేసు కున్నది, విడిపించాడు, నేలమీద పడిపోయింది. అంతలోనే లేచి హెడ్డు చేతులు పట్టుకున్నది.

"నాను తీయనేదు. సాచ్చమేదీ, అనుమాన చెప్తన్నారు హెడ్డుగారూ" అంటూ మళ్ళా నేలమీద బడి పొల్లి కింతలు పెట్టింది, జుట్టు వూడింది, మొహాని కంటుకున్నది.

మరో రెండు దెబ్బలు వినిపించినై, పెడబొబ్బలు పెట్టింది. మొహం పెదిమలూ చిట్లినై, పెంకులు గుచ్చుకుని చేతులు మీద రక్తం చిమ్మింది, జాకెటు చిరిగింది.

ట్రీట్ మెంటు చివరిదశ కొచ్చింది, హెడ్డు, దాని చీర వూడదీస్తున్నాడు. చినిగిన జాకెట్టులోంచి నూత్న యవ్వనం కనబడింది. ఈశ్వరమ్మ ఒక్క వుదుటున లేచొచ్చి జానకి కాళ్లు గట్టిగా వాటేసుకున్నది. పాదాలమీద తల అన్చి శోకాలు పెట్టింది, ఇటూ అటూ వూగింది, నల్లతాచు మెలికలాడు తున్నట్టున్నది.

'ఇయాల నవ్వు రాదేం అమ్మగారూ? ఇయాల పుస్తక మట్టుకు నవ్వరా? నానన్నేదా నవ్వురాదనీ, పోలీసు తప్పగిస్తారంటినే, నిజమైనాది, యూవంటారు?' అని వాపోయింది.

జానకికి తాను చదివిన కథానిక గుర్తు వచ్చి ఈశ్వరమ్మ ఛాలెంజ్ గుర్తు వచ్చి అంతా తెలిసి పోయింది.

తక్కినవాళ్ళు యేమీ అర్ధంగాక యేమి జరుగుతుందా అని చూస్తూ వుండి పోయారు.

జానకికి బలహీనం మీద యేడుపు వచ్చింది. కళ్ళు తడి అయిస్తై. నవ్వు వచ్చింది.

'అవతలికి పో లే' అన్నది, పాతబంగారు గాజులు బాగా అరిగిపోయినవి చేతికి ఒక్కొక్కటీ వున్నాయి అవి దూసింది.

"ఇలా రా ఒక సారి" అని హెడ్‌ని చేతితో పిలిచింది.

హెడ్డుగారు విధేయుడైన పుత్రుడులాగా, యాంత్రికంగా వచ్చాడు మంత్రించబడినట్టు, జానకి ముందు వంగి దోసిలి పట్టాడు, లాఠీ చంకలో వున్నది. అతని దోసిలిలో రెండు గాజులూ వదిలింది జానకి.

'నేను దాన్ని స్టేషన్కి అప్పగిస్తాను. మీరు వెళ్ళొచ్చు. తీసుకున్న శ్రమకి చాలా థాంక్స్' అన్నాడ.

భాస్కరం, వెళ్ళొచ్చన్నట్టు తలూపాడు, జానకి చూడలేక పోతున్న దకున్నాడు. హెడ్ అటెన్షన్లో నిలబడి సెల్యూటు కొట్టి నిష్క్రమించాడు.

అందరికీ వూపిరాడింది.

ఈశ్వరమ్మ కొంగు ఒంటినిండా కప్పుకున్నది. జుట్టు ముడేసుకున్నది.

'యెలిపోతన్నా' దణ్ణం పారేసింది. వాకిలిదాకా వెళ్ళి వెనక్కి చూసింది. జానకికి దాని కళ్ళలో నవ్వు కనిపించింది. ఈశ్వరమ్మ తనవెనక తలుపు మూసి వెళ్ళింది.

"శాంతా! యేదీ నీటికెట్టు? ఇది కొన్నానని నాకు చెప్ప లేదే, షాపింగుకి వెళ్లావనుకున్నా, స్టేషన్కి వెళ్లావనుకోలేదు. నాకు నయమయే వరకూ వుండకపోయినా, మీరిద్దరూ శలవు పూర్తి అయేవరకన్నా వుంటద్దూ, నవ్వు వచ్చినప్పటి నించీ యెంత సందడి, లే దీవం వేయి, చీకట్లో వుండిపోయామే, లైట్లు రాలేదా? వంటయిందా? పిల్లలు ఆకలి అంటారు శాంతా! పిల్లలు బాబుని తీసుకుని పార్కుకెళ్ళారు. కేక వేసుకురా." అంటూ తలవాల్చింది.

## 4

మరునాడు ఆదివారం, భాస్కరం పెద్ద అందమైనకారు తెచ్చాడు. తమ్ముడు స్టీరింగు వీల్ దగ్గర కూచున్నాడు. అన్న పక్కనున్నాడు దోవ చెప్పేందుకు, శాంతా పిల్లలు వెనక సీట్లో వున్నారు. అన్నవరం వెళ్ళిపోయారు, జానకి బాబూ యింట్లో వున్నారు, పిల్లవాడు నవ్వుతున్నాడు. నీళ్ళు పోయాలని జానకి చొక్కా విప్పుతున్నది.

ఈశ్వరమ్మ గాయాలకి మందురాచుకుని, నుదుటి గాయానికి పట్టీ వేసుకుని, నవ్వుతూ వచ్చింది.

"బాబుకి నేన్నీళ్ళు పోస్తా, మీరెల్లి పడుకోండి" పిల్లవాడి నెత్తుకుని బాత్‌రూమ్‌లో దూరింది.

పిల్లవాడి పనిఅయింది, స్టాండ్ వుయ్యాల్లో వుంచి పూపిప్పి యిచ్చింది, ఇంటి పనంతా చేసింది, సద్దింది. వచ్చి యెదురుగా నిలబడింది, వయ్యారంగా కదులుతూ జడ చివర పట్టుకు తిప్పుతూ, కళ్లు తిప్పుతూ అడిగింది.

అంతా యాడికో పోయారే.

"సిగ్గువదిలేశావా? నవ్వుతూ యెట్లా అడుగుతావు?" విసుగ్గా అన్నది జానకి.

'యాడికెల్లారో సెప్పరూ, బాబు నొదిలి వెళ్లారే' నన్నది దొంగ నవ్వు నాల్గువేపులా చూసింది.

అన్న వతం, జానకి సోఫాలో వాలిపోయింది.

ఈశ్వరమ్మ వూపిరి తీసుకున్నది, ఇకిలిస్తూ దొడ్లోకెళ్ళింది మళ్లా వచ్చింది. వికసించిన మొహం.

'ఇవుగో చూసుకోండి'

జానకి కళ్లు బరువుగా వున్నాయి మెల్లిగా కళ్ళువిప్పింది.

యెదురుగా గుండ్రని బల్లమీద, పోయినాయని గలభా జరిగిన వస్తువులన్నీ వున్నాయి వాళ్లు గుర్తించనివి పిల్లలవి చిన్న చిన్న వస్తువులు గూడా వున్నాయి. షటిల్, రెడ్‌పెన్సిల్ కొత్తరబ్బరు, పెన్సిల్ చెక్కే చిన్న మెషీను, మంగమ్మగారి నోటు, భర్త వెతికిన పెన్ను.

కళ్ళు పెద్దవికాగా వాటివంకా, దాని నవ్వు మొహంవంకా చూసింది జానకి.

"నీ తెలివి తేటలకీ, స మ ర్థ త కీ, చేతివాటానికీ చాలా మెచ్చాను గానీ, యికముందు నిన్ను నమ్మగలనా? నమ్ముతానా? యేది కనపడకపోయినా నీమీద అనుమానం కలగదా?" అన్నది. కోపాన్నీ, జాలినీ, మానవతనూ, కర్కశత్వానిదాచి యివన్నీ యెలాదాచగలిగావూ? అన్నది.

బిజినెస్ మొహం పెట్టింది యీశ్వరమ్మ. అది యేరే సంగతి అమ్మగారూ. యావైనా పోతే గదా నన్ను మానిపించటానికి? అన్నీ వున్నాయా? సరిగా చూచుకోండి. అన్నది.

"యాడ దాచానంటారా? మీయింట్లోనే దాచాను ఒకేల మా యిల్లు సోదా చేయిస్తే యేదీ కానరాదు." అని నవ్వింది.

'బాగానే వున్నది చాతుర్యం, కాని అన్ని దెబ్బలుతిన్నా వెందుకూ? అయువు పట్టున తాకితే యేమయేదీ? ఒప్పుకోవు గదా" ఒప్పుకున్నాను అంటే అనుమానం నిబద్ది అవుతాది. ఇంక నమ్మరు నన్ను. మీకు బయపడ్డాననుకుంటారు, హెడ్డు మూమేగా, యెందుకు సంపుతాడూ? ఆడు రమ్మని కబురెడితే నేనెల్లలేదు, కోపం వచ్చింది. సమయం దొరికిందని కొట్టాడు. వస్తువులిస్తానని గాదమ్మగారూ? అంటూ బాగా నవ్వింది.

'అడికి నా తడాకా తెలీదమ్మగారూ' ఈమాట జానకికి తన ఆశ్చర్యాన్ని దాచలేక పోయింది.

"యేం చేయగలవు హెడ్డునీ? నీకు రెట్టింపు మనిషి. పుద్యోగం వెలిగిస్తున్నాడు."

ఈశ్వరమ్మ డ్రమెటిగ్గా యింద్రజాలం చూపిస్తున్నట్టు తన బాడీస్‌లో చెయ్యిదూర్చి, హెడ్డుగారి నాచీ, వాడి నీలం రాతి బంగారు పుంగరం తీసి జానకి ఒడిలో పడేసి, విరగబడి నవ్వింది

'ఇదెప్పుడు తీశా? యెలా తీశా?' జానకి కళ్ళు పెద్దవై నై నోరు తెరచింది.

'అడు కొడుతున్నప్పుడే తీశా. మరెందుకుకొట్టాల?' కసి తీరినట్టు చూసింది.

'ఇది విని గూడా నిన్ను మానించరంటావా?'

"యెందుకనుమానిస్తారూ, మీరడగనివి గూడా యిచ్చి నానుగాదా, మీరేగదా యిడిపించినారు, అల్లెవరికైనా గుండె కరిగినాదా? ఆడకూతురు గుడ్డలాగుతున్నాడని అడ్డు పడ్డారా, మీకు నామీద నమ్మకమే నన్ను కాపాడింది."

జానకి తల్లి మంగమ్మ వచ్చింది.

'జబ్బుగా వున్న కూతుర్ని వదిలి వెళ్ళిపోయినా, మనసు నిలుస్తుందా జానూ? పోతేపోయింది నోటు అనుకుని వచ్చేశా' అన్నది. పళ్ళు తెచ్చిన బుట్టతాడు విప్పింది. చేతులూ కాళ్లూ కడుక్కొచ్చింది. పండురసం తీసి గ్లాసులోపోసి కూతురు చేత తాగించింది.

'చాలా చిక్కావే జానూ.' అన్నది.

కొంగుకి నోటు ముడివేసుకున్ననావు, నా తెల్ల పట్టుచీర కట్టుకున్నా వమ్మా, ఆచీర నీమంచం మీద దిండుకిందే వుండి పోయింది. దాన్ని చూశాక బీరువాలో వుంచా అన్నది కూతురు లేచి తాళం తీసి చీరతెచ్చి తల్లికిచ్చింది. కొంగున ముడిన నోటు చూసింది తల్లి, నొచ్చుకున్నది.

'నామతి మండిపోనూ, యీశ్వరమ్మని అనవసరంగా తీసెయలేదు గదా. ఇలా పడుకో వీపుమీద రాస్తా' అన్నది.

రాత్రికి అన్నవరం నించి అంతా వచ్చేశారు. భోజనాలు కానిచ్చే వచ్చారుట. జానకిని లేవద్దన్నారు. తీరిగ్గా కూచుని కబుర్లయాక పంచాయితీ జరిపారు.

'ఓటింగు పెదదామత్తగారూ, డిస్మిస్ చేయాలీ అనుంటే సున్నా పెట్టాలి. వద్దు అనుంటే ప్లస్ వెయాలి' అని కాగితం ముక్కలూ, పెన్సిళ్లూ యిచ్చాడందరికీ.

యెవరివి వారికి అందినాయి గనుక, తీసేయక్కర్లేదనే మెజారిటీతో యీశ్వరమ్మకి గెలుపు వచ్చింది.

పంచాయితీ దారులు, యీశ్వరమ్మకి పది రూపాయల జీతం హెచ్చించాలని తీర్మానించారు.

—[o]—